## క్లుప్తంగా

### ప్రథమ చికిత్సతో మేలు



మాట్లాడుతున్న సివిల్ జడ్జి సన్యాసినాయుడు

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** ప్రమాదాలు జరిగినప్పుడు ప్రథమ చికిత్సతో గాయపడినవారికి మేలు జరుగుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ పరిపాలన భవనంలో నిర్వహిస్తున్న ఎనిమిది రోజుల సీనియర్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ కార్యక్రమానికి సోమవారం ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో ప్రథమ చికిత్సపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ.. ప్రథమ చికిత్సపై ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాల సిబ్బందికి కూడా అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైసీబీ సేవా సంస్థ ప్రెసిడెంట్ ఎం.ప్రసాదరావు, ఎంసీ మెంబర్, బి.చిన్మయ్‌రావు, రెడ్‌క్రాస్ సిబ్బంది సత్యనారాయణ, పి.చైతన్య కుమార్, జి.రమణ, గుణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం ఎంపిక



నూతన కార్యవర్గ సభ్యులు

**రణస్థలం:** మండల కేంద్రంలో రణస్థలం, లావేరు ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ నూతన కార్యవర్గ ఎంపిక సమావేశం ఆంధ్రప్రదేశ్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మెట్ట నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా రణస్థలం, లావేరు అధ్యక్షుడిగా బోర కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా నల్లా నాగరాజు, సెక్రటరీగా గురునాయుడు, కోశాధికారిగా శ్రీనివాసరావు, మెంబర్స్‌గా బాబురావు, సత్యరావు, నారాయణ, భాస్కరరావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల అధ్యక్షుడు వెంకటరమణ, శ్రీకాకుళం కోశాధికారి సిద్ధు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య పనులు



ట్రాక్టర్‌లో చెత్తను తరలిస్తున్న దృశ్యం

**ఎచ్చెర్ల:** మండలంలోని భగీరథపురం పంచాయతీలో సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని వీధుల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించారు. ప్రధాన వీధుల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డులకు తరలించారు. మురికి కాలువల్లో పేరుకుపోయిన నిల్వలను తొలగించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు నక్క కృష్ణమూర్తి, సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు.

### నిత్యావసర సరుకులు అందజేత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

**శ్రీకాకుళం అర్బన్:** చిన్నారులు ఆరోగ్యకరంగా, సంతోషకరంగా జీవించాలని అప్‌హోల్డ్ చైర్మన్ ఫిలిప్ తిమోతి అన్నారు. నగరంలోని అప్‌హోల్డ్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో హెచ్ఐవీ చిన్నారులకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కొక్కరికి రూ.1,500 విలువ చేసే నిత్యావసర సరుకులను 23 మంది చిన్నారులకు అందజేయడం జరిగిందన్నారు. ఈ సరుకులను ప్రతి నెలా అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అప్‌హోల్డ్ సంస్థ సీఈవో లిడియా, ఫెసిలిటేటర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరించాలి



మాట్లాడుతున్న లలితకుమారి

**శ్రీకాకుళం న్యూకాలనీ:** ప్రజలు, పార్టీ శ్రేణులకు కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరించాలని బీజేపీ శ్రీకాకుళం తూర్పు మండల అధ్యక్షురాలు కనుగుల లలితకుమారి పేర్కొన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మండల కమిటీ ప్రతినిధులతో పాటు స్థానిక కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై మాట్లాడారు.కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, చల్లా వెంకటేశ్వరరావు, జి.కరుణాకరరావు, డా.పైడి సింధూర, దుర్గారావు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# భౌబోయ్..!



డే అండ్ నైట్ కూడలి వద్ద గుంపుగా సంచరిస్తున్న కుక్కలు



- నగరంలో బెంబేలెత్తిస్తున్న శునకాలు
- విచ్చలవిడిగా దాడులు చేస్తున్న వైనం
- నియంత్రణ చర్యలు శూన్యం

**శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):** నగరంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఏ రోడ్డున చూసినా గుంపులుగా దర్శనమిస్తున్నాయి. హోటల్స్, టిఫిన్ షాపుల వద్ద, వీధుల్లో చేపలు అమ్మేవారి వెంట పదుల సంఖ్యలో కుక్కలు పరుగులు పెడుతున్నాయి. వృథా ఆహారాన్ని తినేందుకు గుంపుగుంపులుగా తిరుగుతున్నాయి. రోడ్లమీద ఎవరు దొరికితే వారిపై దాడిచేసి కాటు వేస్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులను ఎక్కువగా కరుస్తున్నాయి. అలాగే ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా కుక్కల వలన ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనంపై వెళ్లేటప్పుడు వెంటపడుతున్నాయి. అలా అని స్పీడ్‌గా వెళ్తే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒకవేళ నెమ్మదిగా వెళ్తే కాటు వేస్తున్నాయి.

**నియంత్రణ గాలికి**

కుక్క కాటుతో ప్రతిరోజూ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరేవారి సంఖ్య భారీగానే ఉంటోంది. శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో ఊర కుక్కలు 13 వేలకు పైగా, పెంపుడు కుక్కలు అధికారిక లెక్కల ప్రకారం 3 వేలకు పైగా ఉన్నాయి. పెంపుడు కుక్కలకైతే వాటి యజమానులు తగు జాగ్రత్తలు చేపట్టి టీకాలు వేయిస్తున్నారు. అంతేకాకుండా యాంటీ రేబీస్ వంటి టీకాలు కూడా ఎప్పటికప్పుడు వేయిస్తున్నారు. కాని ఊర కుక్కలను మాత్రం నియంత్రించేవారే కరువయ్యారు. సంతానం లేకుండా చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ తూతూమంత్రంగా నిర్వహించి తర్వాత గాలికొదిలేశారు. అందువలన ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు కుక్కల నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రజల ప్రాణాలను రక్షించాలని నగర ప్రజలు కోరుతున్నారు. ఇటీవల కాలంలో కుక్కల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ నగరంలో మాత్రం విచ్చలవిడిగా రోడ్లపై కుక్కలు తిరగడంతో నగరవాసులు భయాందోళనకు గురవుతున్నారు. 2023 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు గ్రీన్‌మెర్సీ, నవంబర్ నుంచి స్నేక్ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ వారు కుక్కల నియంత్రణ చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఈ నియంత్రణ కార్యక్రమం నిరంతరం ఒక డ్రైవ్‌లా చేస్తే తప్ప నియంత్రణ సాధ్యపడే అవకాశం లేదని నిపుణులు చెబుతున్నారు.



అంబేడ్కర్ జంక్షన్ వద్ద కుక్కల స్వైర విహారం

#### బండిపై వెళ్తుంటే కాటేసింది



సాయంత్రం పనులు ముగించుకుని బండిపై ఇంటికి వస్తుండగా ఒక కుక్క వెంటపడి మరీ నా కాలిపై కరిచింది. దీంతో పనికి వెళ్లలేక వారంరోజులు పాటు ఇబ్బంది పడ్డాను. ప్రతిరోజూ ఇంజెక్షన్లు వేసుకుని జాగ్రత్తగా ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. ఇంజెక్షన్‌కి వెళ్లేటప్పుడు చిన్న పిల్లలు, వృద్ధులు చాలా మంది కుక్కకాటుకి గురై అక్కడికి రావడం గమనించాను. కుక్కల నియంత్రణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలి.

– సాతివిల్లి వెంకటరాజు, హడ్కో కాలనీ, శ్రీకాకుళం

#### గుంపులుగా ఉంటున్నాయి



ప్రతిరోజూ నగరంలో చాలా చోట్ల ప్రధాన కూడళ్లు, మెయిన్‌రోడ్లు, వీధుల్లోకి వెళ్లే కార్నర్స్ వద్ద గుంపులుగా కుక్కలు దర్శనమిస్తున్నాయి. ఏఎస్ఎన్ కాలనీకి వెళ్లే రోడ్డులో 20 నుంచి 30 కుక్కలు ఒక పెద్ద మందలా ఉంటున్నాయి. బయటకు రావాలన్నా భయమేస్తోంది. సైకిళ్ల మీద వెళ్లేవారిపై, ద్విచక్రవాహనదారులపై దాడులు చేస్తున్నాయి.

– టి.పవన్, ఏఎస్ఎన్‌కాలనీ రోడ్డు, శ్రీకాకుళం

#### చర్యలు చేపడుతున్నాం



నగరంలో కుక్కల నియంత్రణకు ఇప్పటికే చర్యలు చేపడుతున్నాం. కుక్కలు కాటేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి చర్యలు చేపడతాం.

– పి.వి.వి.డి.ప్రసాద్, కమిషనర్, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్

## సాగునీటి సమస్య పరిష్కరించాలి



అధికారులకు సమస్య వివరిస్తున్న చిరంజీవి, నారాయణరావు

**ఎచ్చెర్ల క్యాంపస్:** ఎచ్చెర్ల మండలంలోని 13 గ్రామాల్లో 8,000 ఎకరాలకు నెలకొన్న సాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీపీ మొదలవలస చిరంజీవి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు అల్లు సూర్యనారాయణలు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన మీకోసం ఫిర్యాదుల విభాగంలో వినతిపత్రం అందజేశారు. నారాయణపురం కాలువ ద్వారా ఖరీఫ్‌లో సాగునీరు అందకపోవడంతో రైతులు పంటలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫరీదుపేట, పూడివలస, ఇబ్రహింబాద్, కుశాలపురం, తోటపాలేం, కొత్తపేట, ముద్దాడ, భగీరథపురం, ధర్మవరం, పొన్నాడ, బొంతలకోడూరు గ్రామాలకు చెందిన రైతులు ఈ కాలువ ద్వారానే వ్యవసాయం చేస్తున్నారని తెలియజేశారు. కాంక్రీట్ లైనింగ్ ఏర్పాటు చేయాలని, మదుములు, షట్టర్ల సమస్య పరిష్కరించి ఖరీఫ్‌కు సజావుగా సాగునీరు అందించే చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఎచ్చెర్లలో నిర్మించిన మెటీరియల్ కాంపోనెంట్ పనుల్లో నాణ్యత లేదని, క్వాలిటీ సెల్ ద్వారా పరీక్షించిన తర్వాతనే బిల్లులు చెల్లించాలని సూచించారు.

## లక్ష్యం దిశగా ముందడుగు వేయాలి



క్రీడాకారులను అభినందిస్తున్న వేణుగోపాల్ తదితరులు

**శ్రీకాకుళం న్యూకాలనీ:** విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యం దిశగా ప్రణాళికతో ముందడుగు వేయాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాణ వేణుగోపాల్ పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర, జిల్లా స్థాయి పెన్కాక్ సిలాట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను స్థానిక మున్సిపల్ వైఎస్సార్ కల్యాణ మండపం ప్రాంగణంలో సోమవారం అభినందించారు.

హేమంత్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో క్రీడాకారులు విజేతలుగా నిలవడం అభినందనీయమని వక్తలు కొనియాడారు. అంతకు ముందు క్రీడాకారులు ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ధర్మశాస్త ట్రస్ట్ అధ్యక్షుడు బరాటం సంతోష్, వీవో ఏఎస్ఎం అంధవరపు సంతోష్, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఇంజినీర్ కొంక్యాన సురేష్, హేమంత్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వై.హేమంత్‌కుమార్, కోచ్ డి.హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

**ఎచ్చెర్ల:** మండలంలోని గురుగుబిల్లి కూడలిలో సర్పంచ్ బాడిత కల్యాణి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చలివేంద్రాన్ని ప్రజలు, బాటసారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భవానీ, వెల్ఫేర్ అసిస్టెంట్ రామప్రసాద్, డీలర్ బాడిత హరికృష్ణ, బ్యాంక్ మిత్ర బాడిత ప్రతిమా, సీఎఫ్ మల్లీశ్వరి, దొండపాటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## గోతులమయం

**ఎచ్చెర్ల క్యాంపస్:** నవభారత్ కూడలి నుంచి పెయిలవానిపేట, కొంచాలకూర్మయ్యపేట, దోమాం వెళ్లే రోడ్డు గోతులమయంగా మారింది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక సార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కరించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న రహదారి

## ఆక్రమణలు అడ్డుకోవాలి

**ఎచ్చెర్ల క్యాంపస్:** ఎచ్చెర్ల మండలంలోని కొంగరాం పంచాయతీ అలపాన గురువునాయుడుపేట గ్రామంలో సర్వే నంబర్ 515 పీ–1లో 8 సెంట్లు ప్రభుత్వ స్థలంలో కొంతమంది అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వీటిని అడ్డుకోవాలని స్థానికులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దార్ బి.గోపాలరావు స్పందిస్తూ ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపడతామని తెలియజేశారు.

### పనిచేయని శుద్ధజల యంత్రాలు



నిరుపయోగంగా ఉన్న రెండు శుద్ధజల యంత్రాలు

**గార:** మండలంలో కె.సైరిగాం పంచాయతీలోని సవిరిగాం యూపీ పాఠశాలలో కొన్ని నెలలుగా శుద్ధజల యంత్రం పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులు ఇంటి దగ్గర నుంచి తెచ్చుకున్న నీటినే వినియోగిస్తున్నారు. పాఠశాలకు నాడు–నేడు ఫేజ్–1 లో భాగంగా రెండు యంత్రాలను సమకూర్చారు. అయితే విలువైన యంత్రాలను వినియోగంలోకి తీసుకురావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై హెచ్ఎం ఎస్.జానకీరాం వద్ద ప్రస్తావించగా సంబంధిత అధికారులకు తెలియజేస్తామన్నారు.

### విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం



విద్యార్థులకు చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

**శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):** ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ఉత్తమ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందించి ప్రోత్సహించడం అభినందనీయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో మలబార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందించే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యతోనే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో మలబార్ స్టోర్ ఇన్‌చార్జి వసీం, మార్కెటింగ్ మేనేజర్ తమ్మినేని రాజు, ఆమదాలవలస కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యామ్ సుందర్, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

### అకాల వర్షం



పొన్నాడలో నేలకొరిగిన వరిపంట

**ఎచ్చెర్ల క్యాంపస్:** ఎచ్చెర్ల మండలంలో ఆదివారం వేకువజామున అకాల వర్షం కురిసింది. ఈదురు గాలులకు విద్యుత్ వైర్లు, స్తంభాలపై చెట్ల కొమ్మలు పడడంతో మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గాలులకు పొన్నాడ, ధర్మవరం ప్రాంతాల్లో విద్యుత్ మోటార్లు ఆధారంగా పండిస్తున్న రబీ వరి పంట నేలకొరిగింది. ఎచ్చెర్ల, సంతసీతారాంపురం ప్రాంతాల్లో జీడి మామిడి, మామిడి పంటపై సైతం తీవ్ర ప్రభావం చూపింది. ప్రధానంగా వ్యవసాయానికి తీవ్రనష్టం వాటిల్లింది.

# చిత్తశుద్ధితో పనిచేయాలి




ర్యాలీ ప్రారంభిస్తున్న జడ్జి సన్యాసినాయుడు

**అరసవల్లి:** క్షయ వ్యాధి నివారణకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా న్యాయశాఖ సేవాధికార సంఘ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవం పురస్కరించుకొని స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నుంచి చైతన్య ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేసిన పలువురికి ప్రశంసా పత్రాలు అందజేశారు. సత్కారాలు పొందిన వ్యక్తులు మరింత బాధ్యతగా పనిచేయాలని సూచించారు. రెండు వారాల కంటే ఎక్కువగా దగ్గు ఉంటే తప్పనిసరిగా దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలను చేయించుకోవాలన్నారు. ఈ వ్యాధికి ప్రభుత్వమే ఉచితంగా మందులను పంపిణీ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ, జిల్లా ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ప్రకాష్‌రావు, క్షయవ్యాధి నివారణాధికారి తాడేల శ్రీకాంత్, డీపీఎంవో వాన సురేష్, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఆదిలింగం, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బెజ్జిపురం ప్రసాదరావు, ఎం.వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

### పరిశుభ్రతతో టీబీ దూరం



అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న దృశ్యం

**గార:** వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో టీబీని దూరం చేసుకోవచ్చునని శ్రీకూర్మం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌కుమార్ అన్నారు. సోమవారం ప్రపంచ టీబీ నివారణ దినోత్సవంలో భాగంగా గ్రామీణ ఆరోగ్య శిక్షణా కేంద్రంలో అవగాహన సమావేశంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికిత్సను పూర్తి చేయడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. సాధారణ అపోహలు, దుష్ప్రభావాల భయాలు, టీబీతో సంబంధం ఉన్న కుటుంబ వ్యక్తులు ఎలా ప్రవర్తించాలన్నది వివరించారు. అదనంగా చికిత్స కూడా శ్రీకూర్మం పీహెచ్‌సీలో పొందవచ్చన్నారు. అనంతరం రోగులు తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మూర్తి, డాక్టర్ ఆశాజ్యోతి, డాక్టర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది పురస్కారాలకు ఆహ్వానం

**శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):** ఉగాది పురస్కారాలు–2025కు సంబంధించి ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ దరఖాస్తులు ఆహ్వానిస్తోందని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈ.ఎస్.ఎస్.నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అర్హులైన కళాకారులు, క్రీడాకారులు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, మేధావులు, వైద్యులు, సమాజ సేవకులు, కర్షకులు తమ ప్రతిభను చాటిచెప్పే సర్టిఫికెట్లను ఈనెల 31వ తేదీలోపు పంపించాలని కోరారు. ఆల్ ది బెస్ట్ అకాడమీ, డోర్ నెం.1–20–164, గోకుల్, వెంకటాపురం, తిరుమలగిరి, సికింద్రాబాద్–15 అడ్రస్‌కు పంపించాలన్నారు. మరిన్ని వివరాలకు 96523 47207 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### నైపుణ్యాలపై దృష్టి సారించాలి

**ఎచ్చెర్ల క్యాంపస్:** విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవడంపై దృష్టి సారించాలని నాంది ఫౌండేషన్ ట్రైనర్ సౌమ్య అన్నారు. చిలకపాలేంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు ఆరు రోజుల పాటు నిర్వహించనున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. విద్యార్థులు పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జి.టి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులు జాగ్రత్తలు పాటించాలి

**శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):** వేసవి నేపథ్యంలో భవన నిర్మాణ రంగ కార్మికులు పనులు చేసే సమయంలో చాలా జాగ్రత్తలు పాటించాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వై.శైలేష్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో యజమానులు తప్పనిసరిగా తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. నీడనిచ్చే షెడ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో పనులు లేకుండా చూడాలన్నారు. పని ప్రదేశాల్లో ఓఆర్ఎస్, ఇన్‌ఫ్లూయిడ్స్, ఐస్‌పాక్స్, వడ దెబ్బ నివారణ చికిత్స ఔషధాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

## కాంట్రాక్టర్‌ను మార్చడంపై ఆందోళన



కార్మికులతో మాట్లాడుతున్న పరిశ్రమ హెచ్ఆర్ దీపక్

**రణస్థలం:** మండలంలోని పైడి భీమవరం పారిశ్రామికవాడలో ఉన్న డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీ సీటీవో–6లో పరిశ్రమలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న 30 మందికిపైగా కార్మికులు సోమవారం నిరసన చేపట్టారు. ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్టర్ నుంచి మరో కాంట్రాక్టర్‌లోకి మార్చడంపై పరిశ్రమ గేటు వద్ద ఆందోళన తెలిపారు. దీంతో హెచ్ఆర్ మేనేజర్ దీపక్ వచ్చి 15 ఏళ్లకు పైబడి పని చేసిన వాళ్లని మాత్రమే మార్చామని, దీనివలన ఎటువంటి నష్టం ఉండదని స్పష్టం చేశారు. ఏ ఒక్క కార్మికుడినీ తొలగించమని హామీ ఇవ్వడంతో నిరసన విరమించి విధుల్లోకి వెళ్లారు.

## సంక్షిప్తంగా..

### పరీక్షా కేంద్రం పరిశీలన

**రణస్థలం:** మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షలు జరుగుతున్న జేఆర్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వీఎన్ మస్తానయ్య సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని గదులకు వెళ్లి పరీక్షలు జరుగుతున్న తీరును స్వయంగా పరిశీలించారు. పక్కాగా పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు. తాగునీరు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.

### భక్తిశ్రద్ధలతో పూజలు

**ఎచ్చెర్ల క్యాంపస్:** ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేటలో వెలసి ఉన్న భూ, నీలా, గోదా, ఆళ్వార్ సహిత రంగనాథస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. వేకువజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. రాత్రికి కల్యాణ మహోత్సవం చేపట్టారు. మొత్తం మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### అసిరిపోలమ్మ పండగలు ప్రారంభం

**ఎచ్చెర్ల క్యాంపస్:** ఎచ్చెర్ల మండలంలోని ముద్దాడ, కొత్తపేట, రుప్పపేట, సెగిడిపేట, అంబేడ్కర్ నగర్, కొయ్యవానిపేట గ్రామాల్లో అసిరిపోలమ్మ గ్రామ దేవత పండగలు ఆదివారం రాత్రి నుంచి ప్రారంభించారు. మంగళవారంతో ఈ పండగలు ముగియనున్నాయి.అమ్మవారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మూడేళ్లకు ఒకసారి ఈ పండగలు నిర్వహిస్తారు. గ్రామాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు చేపడుతున్నారు.

## మళ్లీ అదే కథ..!

- మొరాయిస్తున్న సిగ్నల్ లైట్లు




రామలక్ష్మణ కూడలి వద్ద సిగ్నల్ లైట్స్ వెలగని వైనం

జిల్లాకేంద్రంలోని ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. గత నెల 22న సాక్షి పత్రికలో 'మొరాయిస్తున్నాయ్..!' శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించి ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్ని కూడళ్లలోను లైట్లకు మరమ్మతులు చేయించారు. కాగా మరలా కథ రిపీటైంది. రామలక్ష్మణ, అరసవల్లి మిల్లు, పొట్టి శ్రీరాములు కూడళ్లలో మళ్లీ సిగ్నల్ లైట్స్ మొరాయిస్తున్నాయి. దీంతో వాహన చోదకులు ఆగాలా.. వెళ్లాలా అన్న సందిగ్ధంతోనే అడ్డదిడ్డంగా వెళ్లిపోతున్నారు. కాగా ట్రాఫిక్‌ను మళ్లించాల్సిన అక్కడి సిబ్బంది సెల్‌ఫోన్లు చూసుకుంటూ, లేదా ఛలానాలు విధిస్తూ కనిపిస్తున్నారు. దీంతో ఇప్పటికైనా మున్సిపల్, పోలీసు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

– శ్రీకాకుళం క్రైమ్



అరసవల్లి మిల్లు కూడలి వద్ద...



పొట్టి శ్రీరాములు కూడలి వద్ద...